AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


**వృద్ధులకు ఎంత కష్టమొచ్చే..** 2






**వేధింపులతో యువకుడి ఆత్మహత్య..** 2

## నిర్దేశిత లక్ష్యం మేరకు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జాతీయ ఆహార నూనెల మిషన్-ఆయిల్ పామ్ పథకం కింద జిల్లాకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకుని ఆయా మండలాలలో రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. దీంతో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు రైతులు ఉత్సాహంతో ముందుకు వస్తున్నారని అన్నారు. ఇప్పటికే 134.50 ఎకరాలలో 6,725 ఆయిల్ పామ్ మొక్కలను నాటడం పూర్తయ్యిందని వివరించారు.



## ‘ఇందూరు రణభేరి’ ధర్నాను విజయవంతం చేయండి




**అక్షరటుడే, ఇందూరు:** బీజేపీ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన ‘ఇందూరు రణభేరి’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ,బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి కోరారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతిరెడ్డి ఆధ్వర్యంలో రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ , స్కాలర్‌షిప్ బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో లక్షలాది మంది విద్యార్థులు తమ ఉన్నత విద్యను కొనసాగించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు జరిగే ‘ఇందూరు రణభేరి’ కార్యక్రమంలో ఎంపీ అర్వింద్ పాల్గొంటారన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకర్ లక్ష్మీ నారాయణ, నాగోళ్ల లక్ష్మి నారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రమోద్ కుమార్, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి విజయ్ కృష్ణ, బెల్లల్ శశాంక్, న్యాలం రాజు, బొబ్బిలి వేణుగోపాల్, వంశీ గౌడ్, విపుల్ రావు, రాకేష్, రాజ్ గణేష్ పాల్గొన్నారు.



## అనుమతి లేని క్లినిక్‌ల సీజ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** అనుమతిలేని క్లినిక్‌లపై జిల్లా వైద్యశాఖ కొరడా ఝులిపించింది. జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా నలుగురు పీఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లను సీజ్ చేసింది. నగరంలోని నాలుగో టౌన్ పరిధిలో డీఎంహెచ్‌వో రాజశ్రీ ఆదేశానుసారం వైద్యురాలు సుప్రియ ఆధ్వర్యంలో వైద్యశాఖాధికారులు పలు క్లినిక్‌లపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గతంలో జిల్లాలో పీఎంపీ,ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లను తనిఖీ చేశారన్నారు. అర్హతకు మించి వైద్యం చేయడం.. యాంటీబయాటిక్స్ ఇష్టానుసారంగా ఇవ్వడాన్ని పరిశీలించిన కౌన్సిల్ సభ్యులు సంబంధిత క్లినిక్‌లు నిర్వహిస్తున్న వారికి నోటీసులు సైతం ఇచ్చారు. అనంతరం వారిపై ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదయ్యాయి. ఈ సందర్భంగా మెడికల్ కౌన్సిల్ నుంచి జిల్లా వైద్య శాఖకు వచ్చిన ఆదేశానుసారం గురువారం 4 క్లినిక్‌లను అధికారులు సీజ్ చేశారు. నాలుగో టౌన్ ఎస్ఐ కరీం ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా క్లినిక్‌లకు చేరుకొని సీజ్ చేస్తున్నట్లుగా నోటీసులు అంటించారు, ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు, రామకృష్ణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.




# తెయూలో హైడ్రామా..

> తెలంగాణ యూనివర్సిటీలో కొన్ని నెలలుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత విభేదాలు, పరిపాలనా పరమైన లోపాలు ఒక్కసారిగా బద్దలయ్యాయి. మూడేళ్లుగా రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న ప్రొఫెసర్ యాదగిరి తన పదవికి రాజీనామా చేయడం విశ్వవిద్యాలయంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. అసలు ఈ రాజీనామా వెనుక ఉన్న కారణాలు ఏమిటని సర్వత్రా చర్చనీయాంశమైంది.
>
> \- అక్షరటుడే, తెయూ క్యాంపస్

- రిజిస్ట్రార్ యాదగిరి రాజీనామా
- ఆమోదించని వైస్ ఛాన్సలర్
- చర్చనీయాంశంగా మారిన అంతర్గత విబేధాలు..
- వర్సిటీ పరిపాలనపై ప్రభావం పడుతుందని విద్యార్థుల్లో ఆందోళన

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య బుధవారం యూనివర్సిటీకి వచ్చారు. చైర్మన్ ముందే రిజిస్ట్రార్ మార్పు అంశంపై తీవ్రస్థాయిలో వివాదం చెలరేగింది. యాదగిరి రిజిస్ట్రార్‌గా ఇంకెన్నేళ్లు ఉంటారని పలువురు ప్రశ్నించారు. ‘నన్ను రిజిస్ట్రార్ పదవి నుంచి తొలగించాలని నేనే స్వయంగా వైస్ ఛాన్సలర్‌ను కోరుతున్నప్పటికీ, ఆయన స్పందించడం లేదు’ అని ప్రొఫెసర్ యాదగిరి స్వయంగా చైర్మన్ వెంకటయ్య ఎదుట వాపోవడం గమనార్హం. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరలైంది. ఉన్నత విద్యాసంస్థలో రిజిస్ట్రార్ స్థాయి అధికారి బహిరంగంగా ఇలా మాట్లాడటంపై విమర్శలు వచ్చాయి. తీవ్ర ఒత్తిడి, సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం నేపథ్యంలోనే ప్రొఫెసర్ యాదగిరి తన పదవికి బుధవారం సాయంత్రమే రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

### 2014 నియామకాల నేపథ్యంలో..

యూనివర్సిటీలో 2014లో అధ్యాపకుల నియామకాల వివాదం చాలా ఏళ్లుగా న్యాయస్థానాల్లో నలుగుతోంది. కోర్టు పరిధిలో ఉన్న ఈ అంశంపై యూనివర్సిటీ ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదనే వాదనలు ఉన్నాయి. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, 2014 ఏడాది నియామకమైన అధ్యాపకులకు ప్రమోషన్లు కల్పించేందుకు రిజిస్ట్రార్ అత్యుత్సాహం ప్రదర్శించారనే టాక్ ఉంది. ఆ అధ్యాపకులకు ప్రమోషన్లు ఇచ్చేందుకు వీలుగా ‘లీగల్ ఒపీనియన్’ (న్యాయ సలహా) తీసుకునే పేరుతో యూనివర్సిటీ నిధులు నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేశారని ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి.

### మార్పుపై గతంలోనే ఊహాగానాలు

రిజిస్ట్రార్ మార్పుపై గతంలోనే ఊహాగానాలు వచ్చాయి. పరిపాలనా లోపాలు, సిబ్బంది పట్ల ప్రవర్తన కారణంతో పాటు ప్రధానంగా 2014 ఏడాది నియామక అధ్యాపకుల అంశం నేపథ్యంలో రిజిస్ట్రార్‌ను తక్షణమే తొలగించాలనే డిమాండ్ కొంతకాలంగా వినిపిస్తూ వస్తోంది. ప్రస్తుత రిజిస్ట్రార్‌ను తొలగించి కాకతీయ వర్సిటీ నుంచి ప్రొఫెసర్‌ను ఇక్కడికి రిజిస్ట్రార్‌గా తీసుకొచ్చేందుకు వర్సిటీ వీసీ ప్రయత్నించారని సమాచారం. అయితే రాష్ట్రస్థాయిలో అత్యున్నత పదవిలో ఉన్న జిల్లాకు చెందిన అధికార పార్టీ నేతతో వీసీపై ఒత్తిడి తీసుకొచ్చి తన స్థానికి భద్రపర్చుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. యాదగిరి రాజీనామా చేసిన విషయం వాస్తవమేనని, కానీ తాను ఆమోదించలేదని వీసీ ‘అక్షరటుడే’తో తెలిపారు.

### తక్షణ ప్రత్యామ్నాయం లేకపోవడమేనా..

రిజిస్ట్రార్ పదవికి యాదగిరి రాజీనామాను ఇచ్చినప్పటికీ వీసీ ఆమోదించకపోవడం వెనుక కారణం ఏమై ఉంటుందని యూనివర్సిటీ చర్చ నడుస్తోంది. యూనివర్సిటీ ఇప్పటికే పలు వివాదాలు నడుస్తుండటంతో, ఇప్పుడు రిజిస్ట్రార్ రాజీనామాను ఆమోదిస్తే పరిపాలన మరింత స్తంభించిపోయే ప్రమాదం ఉందని వీసీ భావించినట్లు సమాచారం.రిజిస్ట్రార్ పదవి కోసం యూనివర్సిటీలో కొందరు ప్రొఫెసర్లు పైరవీలు ముమ్మరం చేశారు. రిజిస్ట్రార్ పదవిపై చాలా ఏళ్లుగా ఓ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ కన్నేశారు. అధికార పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అదే సామాజిక వర్గానికి చెందిన మరో ఆచార్యుడు రిజిస్ట్రార్ పదవి ఛేజించుకోవాలని తహతహతో ఉన్నారు.

### వర్సిటీ అభివృద్ధి కోసం..

తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధి కోసం రిజిస్ట్రార్‌గా కొనసాగాలని యాదగిరికి వీసీ ప్రొఫెసర్ యాదగిరి రావు సూచించారు. బుధవారం సాయంత్రం రిజిస్ట్రార్ రాజీనామ చేయగా.. గురువారం ఉదయం యాదగిరిని, వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు తన ఛాంబర్‌లోకి పిలిపించుకున్నారు. రాజీనామాను ఆమోదించలేదని యూనివర్సిటీ అభివృద్ధి కోసం, పరిపాలనా పారదర్శకంగా, సాఫీగా సాగడానికి రిజిస్ట్రార్‌గా కొనసాగాలని వీసీ కోరారు. వీసీ కోరిక మేరకు యాదగిరి తన రాజీనామాను ఉపసంహరించుకుని రిజిస్ట్రార్‌గా విధుల్లో కొనసాగుతున్నారు.

### సిబ్బందిలో అసంతృప్తి

2024 జూన్ 16వ తేదీ నుంచి రిజిస్ట్రార్‌గా యాదగిరి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవలి కాలంలో యాదగిరి పరిపాలనపై పూర్తిగా పట్టు కోల్పోయారనే అపవాదు మూటగట్టుకున్నారు. గతంలో చురుగ్గా వ్యవహరించిన ఆయన, ఈ మధ్య కాలంలో పరిపాలనా వ్యవహారాలను, సిబ్బంది సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు కింది స్థాయి సిబ్బందిని రిజిస్ట్రార్ యాదగిరి చాలా చులకనగా చూస్తున్నారని సదరు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.




## సాంకేతికతతోనే సేవలు వేగం: ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి:** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి వేగంగా, పారదర్శకంగా న్యాయం అందించాలంటే సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాల్సిందేనని ఎస్పీ రాజేష్ చంద్ర స్పష్టం చేశారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సీసీటీఎన్ఎస్2.0తో పాటు ఇతర ఆధునిక పోలీసింగ్ యాప్‌లపై జిల్లా స్థాయి రైటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక సాఫ్ట్‌వేర్లపై పూర్తి అవగాహన ఉంటేనే కేసుల దర్యాప్తులో నాణ్యత పెరుగుతుందన్నారు. కేసుల విచారణలో చిన్న పొరపాటు కూడా పెద్ద ఇబ్బందులకు దారితీస్తుందని గుర్తు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన క్షణం నుంచి చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి వివరాన్ని కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సీఐ శ్రీధర్ గౌడ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## కామారెడ్డి జిల్లాలో పలువురు ఎస్సైల బదిలీలు

**అక్షరటుడే, కామారెడ్డి :** జిల్లా పోలీసు శాఖలో సంచలన బదిలీలు చోటుచేసుకున్నాయి. పలు కీలక పోలీసు స్టేషన్లలో ఇన్‌ఛార్జీలుగా ఉన్న ఎస్సైలను సర్దుబాటు చేస్తూ ఎస్పీ రాజేష్ చంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. మాచారెడ్డి ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అనిల్‌ను భిక్కనూరు స్టేషన్‌కు బదిలీ చేశారు. భిక్కనూరులో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులును రాజాంపేటకు పంపగా, రాజాంపేటలో ఉన్న మహేష్‌ను జిల్లా కేంద్రంలోని సీసీఎస్‌కు కేటాయించారు. ఇక బీబీపేట స్టేషన్ బాధ్యతలు చూస్తున్న విజయ్ ను మాచారెడ్డికి, బాన్సువాడ టౌన్ ఎస్సై నవీన్ చంద్రను బీబీపేటకు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలతో పలు మండలాల్లో కొత్త ఎస్సైలు బాధ్యతలు చేపట్టనున్నారు. కొత్తగా వచ్చిన అధికారులు తమ పరిధిలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించినట్లు సమాచారం.

## పుష్కర ఘాట్ల వద్ద ఏర్పాట్లను పూర్తి చేయాలి: సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సీపీ సాయిచైతన్య అధికారులను ఆదేశించారు. పోచంపాడ్ (శ్రీరాంసాగర్ ప్రాజెక్టు) పుష్కర ఘాట్లను గురువారం పరిశీలించారు. పుష్కర ఘాట్ల నిర్మాణ పరిస్థితులు, భక్తుల రాకపోకలకు అనువైన మార్గాలు, వాకింగ్ ట్రాక్‌లు, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. అత్యవసర సేవల కోసం ఏర్పాటు చేయాల్సిన సదుపాయాలు , హెలిప్యాడ్ స్థలాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశమున్నందున భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ, సీసీ కెమెరాల ఏర్పాటు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, తాత్కాలిక పోలీస్ సహాయ కేంద్రాలు, వైద్య శిబిరాలు, తాగునీరు, పారిశుధ్యం, అత్యవసర స్పందన బృందాల ఏర్పాటుపై ముందస్తు కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, మెండోరా ఎస్సై సుహాసిని, ఇరిగేషన్ శాఖ డీఈ సురేష్, ఏఈ సుశాంత్ కుమార్, వంశీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కామారెడ్డి మున్సిపాలిటీ బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ బిల్లుల చెల్లింపులో భారీ అక్రమాలు జరుగుతున్నాయని కౌన్సిలర్లు ఆరోపించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. 1వ వార్డ్ కౌన్సిలర్ గడ్డమీది మహేష్, 21వ వార్డ్ నాయకుడు తాటి ప్రసాద్, 14వ వార్డ్ నాయకుడు రాంశెట్టి భూపతి మున్సిపల్ ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, అకౌంటెంట్ రాములు బిల్లుల చెల్లింపులో కమిషన్, పర్సంటేజీలు తీసుకుంటున్నారని ఆరోపించారు. విజిలెన్స్ ఆరోపణలు ఉన్న బిల్లులను సైతం అధికారులు ఆమోదిస్తున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీలో ఇష్టానుసారంగా అధికారులు బిల్లులు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎంవో ఎంఏ అండ్ యూడీ, హైదరాబాద్ చీఫ్ సెక్రటరీ మున్సిపల్, రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, సీడీఎంఏ డైరెక్టర్, కామారెడ్డి జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. శానిటేషన్, వాటర్ వర్క్స్, జనరల్ ఫండ్, 14వ, 15వ ఫైనాన్స్, స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులతో చేపట్టిన పనుల బిల్లులపై సమగ్ర విచారణ చేపట్టాలని, విచారణ పూర్తయ్యే వరకు ఎటువంటి బిల్లులు చెల్లించవద్దని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లను కూడా పక్కదారి పట్టించారని ఆరోపించారు.



## హాస్టళ్లలో పరిశుభ్రత పాటించాలి: కలెక్టర్



**అక్షరటుడే, ఇందూరు :** జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. నందిపేటలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. పాఠశాల ఆవరణను, డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. బియ్యం బస్తాలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడ కూడా నీరు నిలువ ఉండకూడదని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. చిన్నచిన్న లోపాలను గమనించిన కలెక్టర్, వాటిని సరి చేసుకోవాలని సూచించారు. బాలికలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. అనంతరం 7వ తరగతి గదికి వెళ్లి విద్యార్థినులతో భేటీ అయ్యారు. విద్యార్థినులు వ్యక్తిగత భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లిదండ్రులు, సంరక్షకులు తప్ప ఇతరులు ఎవరు వచ్చినా వారితో వెళ్లకూడదని జాగ్రత్తలు సూచించారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు, బహుమతులను విద్యార్థినులకు అందించారు. ఎంపీడీవో శ్రీనివాస్ రావు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శాంతికుమారి ఉన్నారు.

## నీటి సంరక్షణతోనే జీవకోటికి రక్షణ



**భీమ్‌గల్, అక్షరటుడే:** నీరు జీవకోటికి ప్రాణాధారమని, నీటిని వృథా చేయకుండా సంరక్షించుకోవడం ద్వారానే భావితరాలకు ఉజ్వల భవిష్యత్తును అందించగలమని భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గజానంద్ పేర్కొన్నారు. కేంద్ర జనశక్తి మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, సీడీఎంఏ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'జల శక్తి అభియాన్ జన భాగీదారి'లో భాగంగా 'క్యాచ్ ది రైన్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించి, ప్రత్యేక చర్చా కార్యక్రమం చేపట్టారు. కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలందరూ తమ ఇళ్ల వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని, తద్వారా భూగర్భ జల మట్టాలను పెంచడంలో తమ వంతు భాగస్వామ్యం అందించాలని కోరారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం ద్వారానే నీటి ఎద్దడిని నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి, అధ్యాపక బృందం, మున్సిపల్ మేనేజర్ నరేందర్, పురపాలక సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోధన్ పట్టణంలో రోడ్లపై ఆక్రమణల తొలగింపు



**అక్షరటుడే, బోధన్:** పట్టణంలో ఆక్రమణలపై ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు స్పందించారు. రోడ్లపై ఆక్రమణలను గురువారం తొలగించే కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు పట్టణంలోని పాత బస్టాండ్, గోశాల రోడ్ ప్రాంతాల్లో గురువారం పరిశీలించారు.. రోడ్లను ఆక్రమిస్తూ నిర్వహిస్తున్న వ్యాపార దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన వ్యాపారస్తులతో మాట్లాడారు. రోడ్లపై వ్యాపారాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. భవిష్యత్తులోనూ తిరిగి తమ దుకాణాలను రోడ్లపైకి తీసుకొచ్చి వ్యాపారం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో నిరంతరంగా తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రతినెల పింఛన్ ఎప్పుడు వస్తుందా అని వృద్ధులు వేయికళ్లతో ఎదురు చూస్తూ ఉంటారు. పింఛన్ అందుకున్న తర్వాత వారి కళ్ళల్లో ఆనందం మరోలా ఉంటుంది. అయితే గాంధారి మండలంలో వింత పరిస్థితి నెలకొంది. పింఛన్ కావాలంటే తప్పనిసరిగా పాన్ కార్డు ఉండాలని పోస్ట్ ఆఫీస్ లో నిబంధన పెట్టడంతో వృద్ధులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

- అక్షర టుడే గాంధారి

# వృద్ధులకు ఎంత కష్టమొచ్చే..

■ గాంధారి పోస్టల్ అధికారుల వింత పోకడ ■ పింఛన్ కావాలంటే ఖాతా ఉండాలని నిబంధన ■ అయోమయంలో వృద్ధులు.. పింఛన్ రాక అవస్థలు

మండలంలో 45 గ్రామ పంచాయతీలు ఉండగా మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్‌లో ఆయా జీపీల్లోని 7,076 వృద్ధులు పింఛన్లు తీసుకుంటారు. గాంధారి మండల కేంద్రంలో 1,416 మంది వృద్ధులు ఉన్నారు. అయితే కొత్తగా పోస్టాఫీస్ సిబ్బంది పెట్టిన నిబంధన కారణంగా వారు అయోమయంలో పడ్డారు. ఈమధ్య పోస్ట్ ఆఫీస్‌కు పింఛన్ కోసం వెళ్తే పాన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకుని రావాలని కొత్తగా అకౌంట్ ఓపెన్ చేసి అందులోనే మీ పింఛన్ వేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఈ వయసులో తాము పాన్ కార్డు కోసం అని ఎవరిని అడగాలని వారు ఆవేదన చెందుతున్నారు.

### పాన్ కార్డు తెస్తేనే పింఛన్..

ఆధార్ కార్డు అంటే తెలిసిన వృద్ధులు పాన్‌కార్డు అంటేనే ఆలోచిస్తున్నారు. పోస్ట్ ఆఫీస్ సిబ్బంది తమ ఖాతాలు తెరిచే లక్ష్యాన్ని భర్తీ చేసుకునేందుకు వృద్ధులను టార్గెట్ చేసినట్లు తెలుస్తుంది. నెలనెలా పెన్షన్ కోసం వచ్చే వీరితో తప్పనిసరిగా అకౌంట్ ఓపెన్ చేయించాలని శాయాశక్తులా ప్రయత్నిస్తున్నారు. అకౌంట్ ఓపెన్ కోసం ఆధార్, పాన్ కార్డు తీసుకుని వస్తేనే పెన్షన్ ఇస్తామన్నట్లుగా మాట్లాడుతున్నారని వృద్ధులు వాపోతున్నారు. ఇప్పుడు పాన్ కార్డు కోసం తాము ఎక్కడకు వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పోస్టల్ ఖాతాలోనే పింఛన్ డబ్బులు..

ఖాతా ఓపెన్ చేయించేందుకు పోస్టల్ అధికారులు వృద్ధులకు లేనిపోనివి చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఖాతా ఓపెన్ చేస్తేనే పింఛన్ వస్తుందని వారికి చెప్పడంతో వృద్ధులు లబోదిబోమంటున్నారు. ఖాతా తెరిచేందుకు రూ.500 అడుగుతుండడంతో వృద్ధులు సందిగ్ధంలో పడ్డారు. దీంతో కొందరు వృద్ధులు తిప్పలు పడి పాన్‌కార్డుకు దరఖాస్తు చేసుకుని తెచ్చుకున్నారు. పోస్టల్ ఖాతాలు తెరుస్తున్నారు. ఇప్పటివరకు 800 పోస్టల్ ఖాతాలు తెరిచినట్లు పోస్టల్ అధికారులు పేర్కొన్నారు. పాత విధానంలో పింఛన్ ఇవ్వాలని వారు కోరుతున్నారు.

### ఖాతాలు అవసరం లేదు

పింఛన్ కావాలంటే తప్పనిసరిగా ఖాతాలు తెరవాల్సిన అవసరం లేదు. పోస్టల్ అధికారులు వృద్ధులకు ఇలా చెప్పడం భావ్యం కాదు. ప్రభుత్వం నుంచి అధికారిక ఆదేశాలు వస్తే మేమే పత్రికాముఖంగా తెలియజేస్తాం. అప్పటివరకు పింఛన్‌దారులు ఖాతాలు తెరిచే అవసరం లేదు. నేరుగానే పింఛన్ తీసుకోవచ్చు.

– దామోదర్ రెడ్డి, డీఆర్‌డీవో

## అత్తతో గొడవ.. యువతి అదృశ్యం

**అక్షరటుడే బాన్సువాడ:** అత్తతో జరిగిన కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువతి అదృశ్యమైన ఘటన వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరి మండలం సుద్దుల తండాకు చెందిన మూడ్ అమ్మిబాయి తన కుమార్తె బానోత్ స్వప్న (25) కనిపించడం లేదని వర్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వర్ని మండలం అంతాపూర్‌లో ఈనెల 9న రాత్రి అత్తతో గొడవ జరిగిన అనంతరం స్వప్న ఇంట్లోనే నిద్రపోయింది. మరుసటి రోజు ఉదయం కుటుంబ సభ్యులు గమనించగా ఆమె ఇంట్లో కనిపించలేదు. బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు.

దీంతో కుటుంబ సభ్యులు వర్ని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా వర్ని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు.

## ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ..



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్ :** మండలంలోని బేగంపూర్ పంచాయతీని ఎంపీడీవో అభినవ్ చందర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీఎస్ పాఠశాల తండా పాఠశాలను పరిశీలించారు. పాఠశాల అంగన్‌వాడీ రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు. అదే విధంగా గ్రామంలో పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు



## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**అక్షటుడే, పెద్ద కొడప్‌గల్:** మండలంలోని కాటేపల్లి తండాలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్యామప్ప పటేల్ స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సహకారంతో పేదప్రజలకు వైద్య చికిత్సలో భాగంగా అండగా ఉండేందుకు చెక్కులను అందజేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని అర్హులైన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందేలా కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగుల గౌడ్, జైరాం, జాగిర్యా, నాగిరెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధికి చేయూతనివ్వాలి: ఎమ్మెల్యే మదన్‌మోహన్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పలు అభివృద్ధికి చేయూతనివ్వాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో పాలనాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు, గిరిజనులు, గ్రామ పంచాయతీలు, తాగునీరు, మౌలిక వసతులు వంటి ప్రజలకు అత్యంత అవసరమైన అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామం సర్వే నెం. 268, మల్తుమ్మెద గ్రామం సర్వే నెం. 834, 838 భూములకు సంబంధించిన రైతులకు ఇప్పటివరకు పట్టా పాస్ పుస్తకాలు అందలేదన్నారు. గండివేట్ తండా, హేమ్లా నాయక్ తండా, వెంకటాపూర్ తండాతో పాటు నియోజకవర్గంలోని పలు గిరిజన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అటవీ శాఖ అధికారులు అటవీ భూముల పేరుతో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. సంబంధిత భూములపై సమగ్ర పరిశీలన చేపట్టి అర్హులైన లబ్ధిదారులకు భూములను కేటాయించాలన్నారు.

## సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** వర్ని మండలం సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కీలక నిర్ణయాలు తీసుకుందని వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని తన కార్యాలయంలో సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల పురోగతిపై ఇరిగేషన్, అటవీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముంపు ప్రభావిత భూములకు నష్టపరిహారం చెల్లించడం, అవసరమైన అనుమతులు పొందడం కోసం రూ.55.30 కోట్లను మంజూరు చేస్తూ జీవో నెం.37ను జూన్ 8న జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రిజర్వాయర్ నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగేందుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దశను క్షుణ్ణంగా పర్యవేక్షిస్తూ, గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అటవీ శాఖ పీసీసీఎఫ్ (నోడల్ ఆఫీసర్) శ్రావణ్, ఇరిగేషన్ ఈఎన్‌సీ శ్రీనివాస్, కామారెడ్డి ఇన్‌చార్జి సీఈ దక్షిణామూర్తి, బాన్సువాడ ఈఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కనీస బాధ్యత మరిచారు : సునీల్‌రెడ్డి



**అక్షరటుడే, భీమ్‌గల్ :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి తాను ఒక శాసనసభ్యుడిననే విషయాన్ని పూర్తిగా మర్చిపోయినట్లున్నారని, కనీస బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ ధ్వజమెత్తారు. భీమ్‌గల్ మండల కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే కుట్రతోనే ఆయన వ్యవహరిస్తున్నారని, ఆయనకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. 2022 జూన్ 18న రూ.35 కోట్ల అంచనా వ్యయంతో పది పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చేందుకు అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావును పిలిపించి ప్రశాంత్ రెడ్డి భూమి పూజ చేశారన్నారు. కేవలం ఎనిమిది నెలల్లోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చి, పైసా నిధులు ఇవ్వకుండా ప్రజలను మోసగించారని మండిపడ్డారు. కాళేశ్వరం పేరిట ఆయన డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వేధింపులతో యువకుడి ఆత్మహత్య..




**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రేమించిన బాలిక తరపు వారి వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన దోమకొండ మండలం చింతమాన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రంగబోయిన సందీప్(23) ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికతో ప్రేమలో పడ్డాడు. ఈ విషయంలో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఏడాది క్రితం అతనిపై పోక్సో కేసు నమోదైంది. ఆ కేసులో సందీప్ జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత కూడా సందీప్ తమ కూతురికి ఫోన్ ద్వారా మెసేజ్‌లు పంపుతున్నాడని ఆరోపిస్తూ బాలిక తల్లిదండ్రులు అతడిని బెదిరించారు. ఇక నుంచి సంప్రదించవద్దని గట్టిగా హెచ్చరిస్తూ మెసేజ్‌లు కూడా పంపారు. ఈ అంశంపై బాలిక తల్లిదండ్రులు మరోసారి దోమకొండ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఎస్సై ఇరువర్గాలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురైన సందీప్ గ్రామ శివారులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొందరు వ్యక్తుల బెదిరింపులు, వేధింపుల వల్లే తమ కుమారుడు ఈ నిర్ణయం తీసుకున్నాడని సందీప్ తల్లిదండ్రులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమారుడి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సందీప్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దోమకొండ ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

## గుండెపోటుతో వృద్ధుడి మృతి..
## ఆస్తి కోసం హత్య చేశారని ఆరోపణలు

**అక్షరటుడే, కామారెడ్డి:** గుండెపోటుతో వృద్ధుడు మృతి చెందాడు. అయితే కన్నతండ్రిని కుమార్తె కుటుంబమే హత్య చేసిందని ఆరోపిస్తూ కోడలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామంలో కలకలం రేపింది. ఫిర్యాదుదారు లావణ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గద్దె నారాయణను నాలుగు నెలల క్రితం కుమార్తె విమల వృద్ధాశ్రమంలో చేర్పించింది. బుధవారం మధ్యాహ్నం నారాయణను విమల ఇంటికి తీసుకురాగా.. అదే రాత్రి ఆయనకు గుండెపోటు వచ్చిందని చెబుతూ ముందుగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, తర్వాత ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. అక్కడ వైద్యులు పరీక్షించి నారాయణ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అయితే విషయం ఎవరికీ తెలియకుండా మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు విమల కుటుంబ సభ్యులు ప్రయత్నించడంతో కోడలు గద్దె లావణ్య అడ్డుకుంది. ఆస్తి కోసమే మామ నారాయణను కుమార్తె విమల, ఆమె కుటుంబ సభ్యులు హత్య చేశారని ఆరోపిస్తూ దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 22న ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట జేఏసీ మహాధర్నా



**అక్షరటుడే, కామారెడ్డి:** సమ్మెను విరమిస్తే డిమాండ్లు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిలబెట్టుకోలేదని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కామారెడ్డిలోని రాజీవ్‌గాంధీ పార్క్‌లో కామారెడ్డి డివిజన్ స్థాయి జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తమ డిమాండ్లపై ప్రభుత్వం మాట తప్పడంతో కార్మికులు ఆందోళనకు సిద్ధమవుతున్నారని తెలిపారు. మరోసారి ఉద్యమించాల్సిన పరిస్థితి వచ్చిందని, ఈ నెల 22న ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా జేఏసీ ఛైర్మన్ హరికృష్ణ, కో ఛైర్మన్ భీమ్‌రాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిష్టగౌడ్, నర్సగౌడ్, అశోక్, కామారెడ్డి డివిజన్ జేఏసీ ఛైర్మన్ సునీల్‌గౌడ్, రంజిత్‌గౌడ్, రాజు, వహీద్, వెంకటేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.